# రాసి పెట్టిన చోటు

## పాలంకి వెంకటరామచంద్రమూర్తి

యమలోకంలో చిత్రగుప్తులవారు ఒకనాటి ఉదయం యథాప్రకారం తమ కార్యాలయానికి వచ్చేసరికి, గుమాస్తాలందరూ లేచి నిలబడి, 'నమస్కారమండీ' అన్నారు.

వాళ్ళ నమస్కారాలందుకుని ఆయన కళ్ళజోడు సవరించుకుంటూ 'భూలోకంలో రేపటితో ఆయుర్దాయం చెల్లిపోయినవాళ్ళ జాబితాలు తయారయాయా?' అని ప్రశ్నించారు.

గుమాస్తాలు, 'సిద్ధంగా ఉన్నాయండి. రేపు మరణించవలసిన మానవుల పేర్లు, వయస్సులు, చిరునామా, మరణసమయం వగైరా వివరాలన్నీ చేర్చి పట్టీలు తయారు చేశాం. తాము ఒక్కసారి చూసి దస్కతు పెడితే వాటిని మృత్యుదేవతకు ఇచ్చేస్తాం' అన్నారు.

చిత్రగుప్తులవారు, ఒక్కొక్క జాబితాయే చూసి, 'సరిగానే ఉంది' అంటూ దస్కతు పెట్టి మృత్యుదేవతకు ఇచ్చేశాడు.

ఆమరునాడు మర్త్యలోకంలో మిథిలానగరమందు జనకమహారాజు మధ్యాహ్న సంధ్యావందనం చేసుకుంటూన్న సమయంలో, శరవేగుడనే పరిచారకుడు గుండెలు కొట్టుకుంటూ వచ్చి రాజుముందు నిలబడ్డాడు.

భయంతో వణికిపోతూన్న సేవకుణ్ణి చూసి రాజు, 'ఏమిరా?' అన్నాడు.

'ప్రభూ, నేను పాకశాలకు అవసరమైన సామగ్రిని తేవటానికి విపణివీధికి వెళ్లాను. అక్కడ నాకు మృత్యుదేవత ఎదురై భయంకరంగా గుడ్లెర్ర చేసింది!' అన్నాడు శరవేగుడు.

జనకుడు, 'మృత్యుదేవత భయంకరంగా ఉండదే? ఆమెను చూచి నువ్వే అనవసరంగా బెదిరిపోయి ఉంటావు. ఆయుర్దాయం చెల్లినవాళ్లని తీసుకుపోవడం ఆమె విధి. ప్రయాణీకుడు బండి రావడంతోనే ఎక్కి వెళ్లిపోయినట్లు మృత్యుదేవత రావడంతోనే ప్రతీ జీవీ వెళ్లిపోవాలి. మరణమనేది తప్పనిసరి ప్రయాణం కనుక భయపడి మాత్రం ఏం లాభం!' అన్నాడు.

శరవేగునికి జనకుడు చెప్పినది బోధపడలేదు. వాడు ఏడుస్తూ, 'ప్రభూ, నేనిక్కడ ఆలస్యం చేస్తే, నన్ను మృత్యువు వచ్చి లాక్కుపోతుంది. నన్ను త్వరగా పోనివ్వండి.' అన్నాడు.

జనకుడు ఆశ్చర్యంతో, 'ఎక్కడికి పోదామని?' అన్నాడు.

శరవేగుడు, 'అయోధ్యానగరానికి పారిపోతాను. అక్కడ సీతమ్మతల్లి వద్ద సేవకుడనై బ్రతుకుతాను' అన్నాడు.

జనకుడు, 'అయితే ఆదారినే పోక నా దగ్గర కెందుకు వచ్చినట్లు?' అన్నాడు.

శరవేగుడు, 'నడిచి వెడితే ఆలస్యమై మృత్యుదేవత నన్ను వెంటాడి పట్టుకుంటుంది! నాకు తమ అశ్వశాలలోని గుర్రాన్ని ఒకదాన్ని ఇప్పించండి.' అన్నాడు.

జనకుడు 'నీ యిష్టం వచ్చిన గుర్రాన్ని తీసుకు వెళ్లు.' అన్నాడు.

అశ్వశాలలోని హయాలలో కల్లా 'మనోవేగం' అనే గుర్రం గొప్పది.

శరవేగుడా గుర్రాన్నెక్కి మిథిలానగరం వదలి అయోధ్యవైపు దౌడు తీశాడు.

జనకుడు ప్రజల యోగక్షేమాలను తెలుసుకోవడంకోసం నగరసంచారానికి బయలుదేరాడు. రాజవీథమ్మటే వెడుతోంటే ఆయనకు ఒక యింట్లోనుంచి రోదనం వినిపించింది.

మహారాజు ఆ గృహాన్ని ప్రవేశించి 'ఎందుకు దుఃఖిస్తున్నారు?' అని అడిగేడు. ఆ యింటివాడు, స్పృహ తప్పి కొనఊపిరితో ఉన్న తన భార్యవైపు చూపి, 'ఎన్ని మందులు పోసినా బ్రతికేటట్టు లేదు.

# ★ రాసిపెట్టిన చోటు ★

నన్ను దుఃఖసముద్రంలో ముంచి వెళ్ళిపోతోంది!' అని ఏడవటం మొదలుపెట్టేడు.

జనకుడు, 'నీవు షావుకారు వద్ద పది రూకలు అప్పు తెచ్చావనుకో. ఆతడు తన బాకీవసూలుకై నీవద్దకు వస్తాడు అప్పు వసూలయేవరకూ నీ గుమ్మంలో ఉంటాడు. వసూలై పోవడంతోనే వెళ్ళిపోతాడు.' అన్నాడు.

ఆ గృహస్థు విస్తుపోయి 'ఇప్పుడీ ఋణప్రసక్తి తెచ్చారు దేనికి ప్రభూ?' అని అడిగేడు.

మహారాజు, 'షావుకారు మల్లేనే భార్య, పుత్రులూ, ఋణాన్ని అనుసరించి వస్తారు. నీ పెరటిలోని పశువులూ, నీవు నివసిస్తోన్న ఈ గృహమూ కూడా ఋణానుబంధరూపేణా వచ్చినవే. వసూలవటంతోనే చక్కాపోయే షావుకారుకు మల్లేనే పశు, పత్ని, సుత, ఆలయములు కూడా పోతాయి. దుఃఖించడం దేనికి?' అని, ఆ గృహస్థుకు మనశ్శాంతి కల్గించి, బయటకు వచ్చాడు.

ఆయన ఈవలకు వస్తోంటే ఆ యింట ప్రవేశింపనున్న మృత్యుదేవత ఆయనను చూసి, 'రాజర్షి పుంగవా, నమస్కారము.' అన్నది.

ఆమె కనపడడంతోనే జనకునకు శరవేగుని మాట జ్ఞప్తికి వచ్చి, 'అమ్మాయ్, నిన్నొకటి అడుగుదామనుకుంటున్నాను.' అన్నాడు.

ఆమె, 'ఏమిటి మహాత్మా?' అన్నది.

జనకుడు, 'ఈ గృహిణిని తీసుకు వెళ్ళడానికి వచ్చిన నీవు విపణివీథిలో కనపడ్డ నా సేవకుడు శరవేగుని చూసి గుడ్లురుమేశావుట, ఎందుకు?' అన్నాడు.

ఆమె, 'నాకు పనిఉన్నచోటికి సూటిగా వెళ్లడమే మామూలు. నేను సాధారణంగా దిక్కులు చూసేదానను కాదు. కాని శరవేగుడా విపణివీథిలో కనపడటంతో ఆశ్చర్యంవేసి, "వాడేనా వీడు?" అని పరికించి చూశాను' అంది.

జనకుడు, 'నీకు వాణ్ణిచూడటంతోనే ఆశ్చర్యం ఎందుకు కలిగింది?' అని అడిగేడు.

ఆమె చిత్రగుప్తుడిచ్చిన జాబితాను తీసి, దానిలో శరవేగుని పేరుకు ఎదురుగా నున్న చిరునామాను చూపించింది.

జనకుడు, "శరవేగుడు-వయస్సు ముప్ఫైయారు - మరణసమయం ముప్ఫైరెండు ఘడియల ఏడువిఘడియలు — చిరునామా, అయోధ్యానగరంకోటగుమ్మం" అని చదివేడు.

మృత్యువు, "ఈ సాయంత్రం అయోధ్యానగరం కోటగుమ్మంలో నాకోసం కనిపెట్టుకొని ఉండవలసిన శరవేగుడు మిథిలానగరంలో ఉన్నాడేమిటి? చిత్రగుప్తులవారిచ్చిన చిరునామా తప్పు కాదు గదా?' అనుకుంటూ వాడికేసి ఒకమాటు చూశాను. అంతే" అంది.

జనకుడు, 'చిత్రగుప్తుడు ఇచ్చిన చిరునామా సరియైనదే! శరవేగుడు సాయంకాలానికి అయోధ్య చేరుకుంటాడు!' అన్నాడు.

మృత్యువు, 'అది సాధ్యమా? ఎక్కడి మిథిల! ఎక్కడి అయోధ్య!' అంది.

జనకుడు 'శరవేగుడు నా అశ్వశాలలోని 'మనోవేగమనే' గుర్రాన్ని కోరి తీసుకున్నాడు!...ఆహా, ఎంత చిత్రంగా ఉంది! నిన్ను తప్పించుకు పారిపోతున్నాననుకుంటూ పోయి నిర్ణీతప్రదేశానికి వచ్చి నిన్ను కలుసుకుంటున్నాడు!' అన్నాడు.

★


పంచతంత్రం

బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-80

ఆంధ్రగ్రంథమాల మద్రాసు!

15 జ్యూయల్సు

చేతిగడియారం రు. 5





స్విస్ తయారీ. 15 జ్యూయల్సు అసలు చేతిగడియారం. 15 ఏళ్ల గ్యారంటీ. వి.పి. పోస్టేజీ రు. 1/8 - అదనం.

JAI HIND WATCH Co.,
P. B. 97 (A. P. W) AMRITSAR.